

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లతో మంత్రి తుమ్మల

బీఆర్‌ఎస్‌కు షాక్

- ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి జంప్
- కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ముందు ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదుగురు కార్పొరేటర్లు గురువారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు మడూరి ప్రసాద్, ఆళ్ల నిరీషారెడ్డి, రాపర్తి శరత్, పాలెపు విజయలక్ష్మి, మేడారపు వెంకటేశ్వర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ సందర్భంగా ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రశాంతమైన నగరాన్ని కోరుకొనే ఖమ్మం ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ప్రజలతో పాటు కాంగ్రెస్ పాలన పట్ల ఆకర్షితులైన ప్రజాప్రతినిధులు కూడా ఇప్పుడు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. అందరిని కలుపుకుని ఖమ్మాన్ని అన్ని రంగాల్లో ముందుంచడమే తన లక్ష్యమని తుమ్మల ప్రకటించారు.

గత ఐదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఛిన్నాభిన్నమైందన్నారు. అవినీతి, అరాచకం, కబ్జాలు, మోసాలు, బెదిరింపులతో ప్రజలు విసిగిపోయారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సోనియా, రాహుల్‌గాంధీతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిందని, ఫలితంగానే ఈ గౌరవం దక్కిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మరింత మెజారిటీతో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసిమెలిసి కాంగ్రెస్‌లో ప్రయాణం సాగించాలని సూచించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాయకత్వంలో ఖమ్మం నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించబోతోందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహార, కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడి, నారాయణ రావు, వీ.వీ.పాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని కిడ్నీ డయాలసిస్ కేంద్రంలో మరణ మృదంగం మోగుతోంది. గడిచిన ఆరునెలల్లో ఈ కేంద్రంలో 45 మంది మృతి చెందినట్లు సమాచారం. జిల్లా ఆస్పత్రిలో ప్రతీ రోజు కనీసం 55నుంచి 60 డయాలసిస్‌లు జరుగుతున్నాయి. ప్రతి నెలా కనీసం 1,500 సెషన్లు నిర్వహిస్తున్నారు. అయితే డయాలసిస్ సెంటర్‌లోని సిబ్బంది అలసత్వం, అవగాహనలేమి తనంతో వ్యాధిగ్రస్థులు పిట్టల్లా రాలిపోతున్నారు. గత ఆరు నెలల్లో 45 మందికి పైగా డయాలసిస్ రోగులు మృత్యువాత పడ్డట్లు సమాచారం. ఫలితంగా ఆస్పత్రి లోని డయాలసిస్ కేంద్రానికి రావాలంటేనే బాధితులు హడలిపోతున్నారు.



- ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో మరణమృదంగం
- ఆరు నెలల్లో 45మంది మృతి?
- జిల్లాలో రోగులకు సరిపడా అందుబాటులో లేని కేంద్రాలు
- నెఫ్రాలజిస్ట్ సేవలపైనా విమర్శలు
- బాధితుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది
- పట్టించుకోని ఆసుపత్రి అధికారులు

'డై'యాలసిస్!

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 22: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కిడ్నీవ్యాధిగ్రస్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డయాలసిస్ సెంటర్లు మొత్తం 9 మాత్రమే ఉన్నాయి. వాటిలో 516మంది బాధితులు రిజిస్టర్ చేసుకున్నారు. కొంతమంది ఇతర జిల్లాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆర్థికస్థోమత లేనివారు డయాలసిస్ చేయించుకోకుండానే తనువు చాలిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సుమారు 350 మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. వీరికి సరిపడా డయాలసిస్ కేంద్రాలు జిల్లాలో అందుబాటులో లేవు.

ప్రభుత్వ డయాలసిస్ కేంద్రాలు ఖమ్మం, సత్తుపల్లిలో మాత్రమే ఉండగా ప్రైవేట్‌లో ఖమ్మంలోని మమత, శ్రీరక్ష ఆస్పత్రుల్లో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు. మణుగూరు, అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 24 యంత్రాల ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. రోగులకు ఇది ఏమాత్రం సరిపోవడం లేదు. ఇక హెచ్‌ఐవీ రోగులకు డయాలసిస్ చేయడం లేదని ఇటీవల కొందరు రోగులకు చెందిన బంధువులు కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

ఆరు నెలల్లో 45 మంది మృతి ?

ఖమ్మం ప్రభుత్వ డయాలసిస్ కేంద్రంలో కొన్ని రోజులుగా డయాలసిస్ బాధితులు మృతి చెందడం కలకలం రేపుతోంది. వారికి సేవలు అందించటంలో ఈ కేంద్రం నిర్వాహకులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని కేంద్రాన్ని దీపిచంద్ డయాలసిస్ సెంటర్ అనే సంస్థకు ఐదేళ్లపాటు లీజుకు ఇచ్చారు. వారు ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఆరు నెలల్లోనే 45మంది మృత్యువాత పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అయినా ఈ సెంటర్‌కు చెల్లింపులు చేసే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులుగానీ ఆస్పత్రి అధికారులుగానీ నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రానికి నెఫ్రాలజిస్ట్ కూడా రావడం లేదని, దీంతో రోగులకు సరైన సమయంలో, సరైన సేవలు అందడం లేదని ఆరోపిస్తున్నారు. డయాలసిస్ కేంద్రంలో ఎవరైనా మృతి చెందితే అందుకు గల కారణాలను తెలియజేస్తూ నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ డయాలసిస్ సెంటర్ నిర్వాహకులు మాత్రం తమ తప్పులేదని, ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందారని చెబుతున్నారు.

గతంలో ఈ కేంద్రం నిర్వణ చేపట్టిన ఓ ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం ఒక్కో రోగికి రూ.1,250 చెల్లించేంది. కానీ ప్రస్తుతం నిర్వహిస్తున్నవారికి ప్రభుత్వం రూ.1,820లు చెల్లిస్తోంది. దీంతో పాటు బ్లడ్, డిశ్చార్జ్, రవాణా ఖర్చులు, మందులు కూడా ప్రభుత్వం ఇచ్చేలా ఆసుపత్రి అధికారులు అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. నిబంధలన ప్రకారం ఏ సంస్థకైతే డయాలసిస్ సేవలను అప్పగిస్తారో ఆ సంస్థ మాత్రమే వీటన్నింటికీ బాధ్యత చేపట్టాల్సి ఉంది. కానీ ఈ సంస్థతో కొందరు అధికారులు లాలూచీ పడి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంస్థ అందించే బిల్లులను ఆరోగ్యశ్రీట్రస్ట్ అధికారులు తిరస్కరిస్తుండడంతో ఆ ప్రభావం రోగులపై పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డయాలసిస్ చేయించుకున్న వారికి కనీసం పది విడతల తరువాతైనా రవాణా చార్జీలను కేంద్రం అధికారులు రోగులకు అందించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఆ చార్జీలు ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బాధితులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నా, అందాల్సిన మందులు, రవాణా ఖర్చులు మాత్రం చెల్లించట్లేదు. ఇదిలా ఉండగా గత కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లాలో కిడ్నీ డయాలసిస్ చేయించుకునే వారికి పింఛన్ కూడా అందట్లేదని సమాచారం. డయాలసిస్ కేంద్రాల్లో రోగులకు టిఫిన్, స్నాక్స్ అందించాలనే నిబంధన కూడా ఎక్కడా అమలు కావట్లేదు.

ఎలాంటి ఫిర్యాదులు అందలేదు

డాక్టర్ కిరణ్‌కుమార్, ఖమ్మం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్



ఖమ్మం జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంపై ఎలాంటి ఫిర్యాదుల రాలేదు. రోగులకు అందాల్సిన సేవలపై నిత్యం పర్యవేక్షిస్తునే ఉన్నాం. ఇటీవలే మరణాలు సంభవిస్తున్నాయని చెబుతున్నారు. కానీ ఆస్పత్రిలో ఎక్కడా నమోదు కావడంలేదు. రోగులకు స్నాక్స్, ఇతర సౌకర్యాలు సదుపాయాలపై దృష్టిసారిస్తాం. మరో మారు పరిశీలించి ఆదేశాలు జారీ చేస్తాం.

రోగులకు తప్పని భారం

ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్ర నిర్వాహకులు రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. కొందరు సిబ్బంది రోగుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాథ్‌టార్ అనే పరికరం కోసం ఒక్కోరోగి నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడి సిబ్బంది తాము అడిగింది ఇవ్వకుంటే సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారిని కూడా గంటల తరబడి వెయిటింగ్‌లో ఉంచుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో నేడు పాఠశాలలకు సెలవు

కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో బుధ, గురువారాల్లో సమ్మక్క, సారలమ్మలు కొలువుదీరినందున శుక్రవారం మొక్కుల సమర్పణ ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని సెలవు ప్రకటించినట్టు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం సెలవు ఇచ్చినందున ఇందుకు బదులుగా మార్చి 9న (రెండో శనివారం) పనిదినంగా పాటించాలని ఆమె సూచించారు.



కేఎంసీ పనులపై విజి'లెన్స్'

- గడిచిన ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్ల ఖర్చు
- అక్రమాలు, అవకతవకలపై కూపీ
- రంగంలోకి నలుగురు అధికారుల బృందం
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

ఖమ్మం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) పరిధిలో గడిచిన ఐదేళ్లుగా జరిగిన రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులపై విచారణకు విజిలెన్సు రంగంలోకి దిగింది. ఈ మేరకు వరంగల్‌కు చెందిన నలుగురు అధికారుల బృందం గురువారం ఖమ్మం చేరుకుంది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్పెషల్‌గ్రాంట్ నిధులు, ఎల్‌ఆర్‌ఎస్, సుడా, సాధారణ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు గ్రాంట్ల నిధులు, పనులపై ఆరా తీయబోతున్నారు.

ఈ బృందం కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పనులపై విచారణ చేపట్టింది. ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లేదని, అత్యధికంగా ఎస్టిమేషన్లు వేసుకున్నారని, తూతూమంత్రంగా పనులు చేపట్టి నిధులు ఖర్చుపెట్టారని పలు ఫిర్యాదులు విజిలెన్సుకు వెళ్లాయి. గోళ్లపాడు ఛానల్, లకారం చెరువు సుందరీకరణ, ఖమ్మం నూతన బస్టాండ్, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో విద్యుదీకరణ, రోడ్లు, డ్రెయిన్లు మరుగుదొడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డివైడర్లు, మానవవ్యర్థాల శుద్ధీకరణ పనులతో పాటు కార్పొరేషన్ భవన నిర్మాణం ,మోడ్రన్ మార్కెట్‌లు, మోడ్రన్ ఫుట్‌పాత్‌లు, మిషన్‌భగీరథ, సుడా ద్వారా ఖమ్మం కార్పొరేషన్, రఘునాధపాలెం మండలంలో చేపట్టిన పనులు, చెరువుల ఆధునీకరణ పనులు పై మొత్తం విచారణ చేయబోతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా టెండర్ల నిబంధనలు లేకుండా చేపట్టిన అభివృద్ధి పనులు గురించి వివరాలు సేకరిస్తున్నారు.

అయితే ఈ పనుల నిర్మాణం, ఎస్టిమేషన్లు , బిల్లులు చెల్లింపు తదితర విషయాల్లో నిబంధనలు పాటించలేదని, సిఫార్సులకు అనుగుణంగా కావాల్సిన కాంట్రాక్టు సంస్థలకు, వ్యక్తులకు పనులు కట్టబెట్టి చేయించారని విజిలెన్సుకు ఫిర్యాదులు వెళ్లడంతో విజిలెన్సు అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఈవిచారణ బృందం ఖమ్మం చేరుకుని కూపీ లాగుతోంది. కొంతమంది కార్పొరేటర్ల వద్ద, మాజీ కార్పొరేటర్ల వద్ద ఫిర్యాదులు తీసుకుని విచారణ సాగిస్తున్నారు.

గడిచిన ఐదేళ్లలో ఖమ్మం కార్పొరేషన్‌లో సుమారు రూ.1000 కోట్ల మేర కార్పొరేషన్‌తో పాటు పలు శాఖల నుంచి ఖమ్మంలో అభివృద్ధి పనులు జరిగాయి. ఈపనుల్లో ఎక్కువ శాతం ఒకే నిర్మాణ సంస్థతో చేపట్టడం అప్పట్లోనే చర్చనీయాంశమైంది. అందరు కాంట్రాక్టర్లుకు కాకుండా కొందరు బినామి కాంట్రాక్టర్లకే పనులు దక్కడం ఆ పనుల్లో లోపాలు, నిధులు దుబారాతోపాటు నాణ్యతా లోపాలను విజిలెన్సు కమిటీ పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వబోతుంది.

సాగుబాటలోనే ఎంతో సంతృప్తి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- ఎన్‌ఆర్‌లు కూడా స్వగ్రామాల్లో వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు..
- కరోనా విలయాన్ని సైతం అన్నదాతలు తట్టుకున్నారు..
- ఖమ్మం-కోదాడ సరిహద్దులో డ్రైపోర్ట్ ఏర్పాటుకు పరిశీలన
- ఢిల్లీ రైతుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్నా
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తల్లాడ, ఫిబ్రవరి 22: అన్ని ఉద్యోగాల కంటే వ్యవసాయ ఉద్యోగమే అందరికీ సంతృప్తినిస్తుందని, అందుకే అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న మన తెలుగు రైతు బిడ్డలు కూడా ఇక్కడ వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెంలో ఉద్యానవన శాఖ సబ్సిడీతో నిర్మించిన ఒక ప్రైవేటు ఏసీ గోదాంను మంత్రి తుమ్మల ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ విదేశాల్లోని ఎన్‌ఆర్‌ఐలు తమ స్వగ్రామాల్లో వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇప్పటికే కొందరు సొంత ప్రాంతాలకు వచ్చి వ్యవసాయం చేస్తుండగా మరికొందరు అక్కడి నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తూ వ్యవసాయం నడిపిస్తున్నారని గుర్తు చేశారు. కరోన సమయంలో అనేక మంది ఇతర రంగాల్లోని ప్రముఖులు కరోనాకు గురై మరణించారని, అరక దున్నే అన్నదాతలు మాత్రం కరోనాను తట్టుకుని నిలబడగలిగారని అందువల్లే భారతదేశం వ్యవసాయం సుభిక్షంగా ఉండి అనేక దేశాల్లో ఆర్థికమాంద్యం వచ్చినా దేశంలోని అన్నదాతల కృషి కారణంగా వ్యవసాయ పంటలు పుష్కలంగా కరోన సమయంలో కూడా పండాయని గుర్తుచేశారు.

అన్నదాతపై ప్రకృతి, అడవిజంతువులు, మార్కెటింగ్ అధికారులు దాడులు చేయడమేకాక రాజకీయ నాయకులు కూడా ఇబ్బందులు పెడుతుంటారని వీటన్నింటినీ తట్టుకొని రైతు పండిస్తేనే మనుగడ కొనసాగుతుందన్నారు. కేంద్రప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులకు ఇబ్బందులు వస్తున్నాయని, ఇండోనేషియా నుంచి పామాయిల్‌ను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడం జరిగిందని, ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ విషయంలో కేంద్రం ఒక సుస్థిరమైన అభిప్రాయానికి రావాలని సూచించారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కావాలని కోరుతూ హర్యానా, పంజాబ్ రైతులు రోడ్డెక్కి చేస్తున్న ఉద్యమానికి మంత్రిగా, రైతుగా సంఘీభావం తెలుపుతున్నట్టు మంత్రి ప్రకటించారు.

పామాయిల్ విత్తనం తయారుచేసే ప్రక్రియను కూడా ఖమ్మంజిల్లాలోనే ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో పామాయిల్ సాగు ఎక్కువగా ఉన్న దృష్ట్యా పామాయిల్ తయారుచేసే సంస్థను కూడా త్వరలో ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఎంవోయూ కుదిరిందన్నారు. భద్రాద్రి రామయ్య దయ వల్ల, తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యఫలితంగా తాను వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టానన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరందించడమే తన ధ్యేయమన్నారు.

ఖమ్మం-కోదాడ సరిహద్దులో డ్రైపోర్టు

ఖమ్మంజిల్లాతోపాటు సూర్యాపేట జిల్లాలోని కోదాడ సరిహద్దులో రాష్ట్ర ప్రభుత్వం డ్రైపోర్టు ఏర్పాటుచేసేందుకు పరిశీలన సాగిస్తుందని మంత్రి తుమ్మల ప్రకటించారు. బందర్ పోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే డ్రైపోర్టు ఏర్పాటుచేస్తే ధాన్యం, ఇతర పంటలు, ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు సులభతరం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధిలో 'ప్రైవేటు' భాగస్వామ్యమూ ఉండాలి...

- పంటలకు కావాల్సిన ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీ సౌకర్యాలు కల్పించాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సుజాతనగర్‌లో రవి సీడ్స్ విత్తన పరిశోధన క్షేత్రం పరిశీలన

7

సాధారణ కాన్పులపై శ్రద్ధ చూపాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 22: భద్రాచలం ఏరియా వైద్యశాలలో సాధారణ కాన్పులు ఎక్కువగా జరిగేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సూచించారు. ఐటీడీఏలోని తన ఛాంబర్‌లో గురువారం భద్రాచలం పట్టణ స్త్రీల వైద్య నిపుణులు, రేడియాలజిస్ట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎక్కువగా సిజేరియన్లు జరిగే ఆసుపత్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిజేరియన్లు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయని అయా ఆసుపత్రుల వైద్యులను ప్రశ్నించారు. ఎక్కువ శాతం సాధారణ సాధారణ కాన్పులు జరిగేలా చొరవ చూపాలన్నారు. గర్భిణులకు లింగనిర్దారణ పరీక్షలు చేయకూడదన్నారు. ఏమైనా సమస్య ఉండి అబార్షన్ చేయవలసి వస్తే తప్పకుండా తమ అనుమతి తీసుకోవాలని సూచించారు. స్త్రీ వైద్య నిపుణులు, రేడియాలజిస్ట్‌లు తప్పకుండా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో రోస్టర్ ప్రకారం డ్యూటీలు వేసుకొని రోజుకు ఒకరు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉచితంగా సేవలు అందించాలన్నారు. ఏరియా వైద్యశాలలో ఎక్కా వైద్యుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో శిరీష, డాక్టర్లు రామకృష్ణ, చైతన్య, వైద్యులు పాల్గొన్నారు.

మోదీ సర్కారు మూల్యం చెల్లించుకుంటుంది...



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వామపక్షాల నాయకులు

- ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు హేయం
- వామపక్షాల నాయకుల విమర్శ
- నగరంలో ఐక్య నిరసన, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

7

నత్తనడకన 'ప్రసాద్' పనులు

- 9 నెలల క్రితం రాష్ట్రపతి శంకుస్థాపన
- భద్రాద్రిలో నేటికి పూర్తయింది మూడు శాతమే..
- పర్ణశాలలో ఇంకా ప్రారంభం కాని వైనం
- మూడు నెలల్లో ముగియనున్న ఒప్పంద గడువు
- కాంట్రాక్టర్ పనితీరుపై సర్వత్రా ఆక్షేపణలు



2022 డిసెంబరు 28న ప్రసాద్ పనులకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్రపతి

మందు బాబులకు షాక్ | బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 594 మందిపై కేసు నమోదు

7



తీర్థబిందెను తీసుకు వస్తున్న అర్చకులు

సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ

భద్రాద్రిలో నేడు, రేపు మహోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 22: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహస్ర కలశాభిషేక మహోత్సవాల్లో భాగంగా గురువారం సంప్రదాయబద్ధంగా అంకురార్పణ చేశారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఏటా భద్రాద్రి రామయ్యకు సహస్రకలశాభిషేకాన్ని నిర్వహిస్తారు. ముందుగా గోదావరి నుంచి తీర్థబిందెను తీసుకొచ్చి అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వైదిక సిబ్బందికి దీక్ష వస్త్రాలు అందజేశారు. శుక్రవారం సహస్ర కలశ వాహన, శనివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని సహస్రధారతో కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలను పురస్కరించుకొని శుక్ర, శనివారాల్లో శ్రీ సీతారామచంద్రస్వామి నిత్యకల్యాణాలను, సంధ్యాహారతి నిలిపివేశారు. శనివారం సాయంత్రం రంగనాయకస్వామి వార్షిక కల్యాణాన్ని నిర్వహించనున్నారు.



జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.



సమ్మక్కగద్దె



క్యూలైన్లలో భక్తుల రద్దీ







ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

వైరా శిఖం భూముల ఆక్రమణ

- పోటాపోటీగా గుడిసెలు వేసిన స్థానికులు



శిఖం భూమిలో వేసిన గుడిసెలు

వైరా, ఫిబ్రవరి 22: వైరా రిజర్వాయర్ శిఖం భూములను గురువారం కొంతమంది పోటీలు పడి ఆక్రమించారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని 2,3 వార్డులకు చెందిన వారు తమ నివాసాల పక్కనే ఉన్న రిజర్వాయర్ శిఖం భూములను ఆక్రమించారు. ఇప్పటికే వైరాలోని ప్రభుత్వ భూములు ఆక్రమణదారులకు అడ్డాగా మారింది. ఈ తరుణంలో రెండు, మూడు వార్డులకు చెందిన వారు తాము పేదలుగా చెప్పుకుంటూ నివాసాల కోసం శిఖం భూముల్లో గుడిసెలు వేశారు. పరదాలు, చీరలు, పాత దుస్తులతో గుడారాలు ఏర్పాటుచేశారు. సిమెంట్ స్తంభాలు పాతి హద్దులు పెట్టుకున్నారు. ఈ ఆక్రమణల ప్రాంతం కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు రెవెన్యూతోపాటు వైరా మండలం సోమవరం రెవెన్యూకు సరిహద్దుల్లో ఉంది. విషయం తెలిసిన వెంటనే వైరా-1 గిర్దావర్ ఎం.వెంకటేశ్వర్లు చెరువు శిఖాన్ని ఆక్రమించిన ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలని, ఇళ్లస్థలాలు అవసరమున్నవారు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వారికి స్పష్టం చేశారు. ఆక్రమణదారుల వివరాలను సేకరించారు.

అనారోగ్యంతో ఏఐటీయూసీ నాయకుడి మృతి



అప్పారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అయోధ్య

అశ్వాపురం, ఫిబ్రవరి 22: మండల కేంద్రమైన అశ్వాపురానికి చెందిన ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి చింతకాయల అప్పారావు (45) గురువారం తెల్లవారుజామున బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందాడు. అప్పారావు గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అప్పారావు మృతదేహన్ని సీపీఐ రాష్ట్ర నాయకుడు అయోధ్య సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కవటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పాల్గొన్నారు.

రాగమయి గెలిస్తే.. మోకాళ్లపై మెట్లు ఎక్కుతా..

మొక్కు తీర్చుకున్న మాధవ్



మోకాళ్లపై నడుస్తున్న మాధవ్

కల్లూరు, ఫిబ్రవరి 22: సత్తుపల్లి ఎమ్మెల్యేగా మట్టా రాగమయి ఎన్నికైతే పుణ్యక్షేత్రంలో గల మెట్లు మోకాళ్లతో ఎక్కుతానని మొక్కుకున్న ఓ వ్యక్తి తన మొక్కుకు గురువారం చెల్లించుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కప్పలబంధం గ్రామానికి చెందిన బీరవల్లి మాధవ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి గెలిస్తే పశ్చిమ గోదావరి జిల్లా గౌరిపట్నంలోని మేరిమాత పుణ్యక్షేత్రానికి వచ్చి మోకాళ్లపై 176మెట్లు ఎక్కుతానని మేరిమాతకు మొక్కుకున్నాడు. రాగమయి గెలవడంతో గురువారం మెట్లు ఎక్కి మొక్కు తీర్చుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులు మాధవ్‌కు అభినందనలు తెలిపారు.





రిజర్వాయర్ నీటితో సౌజన్య, క్షేమంగా ఒడ్డుకు చేర్చిన ఎస్ఐ, పోలీసులు

రిజర్వాయర్‌లో పడిన మహిళ

కాపాడిన పోలీసులు

వైరా, ఫిబ్రవరి 22: వైరా రిజర్వాయర్‌లో పడిన వివాహితను పోలీసులు, స్థానికులు ప్రాణాలతో సురక్షితంగా కాపాడారు. వైరా పాత బస్టాండ్ సమీపంలో జాతీయ ప్రధాన రహదారి పక్కన రెడీమేడ్ షాపు నిర్వహిస్తున్న సామినేని సౌజన్య రిజర్వాయర్‌లో పడిపోయింది. అయితే ఆమెకు ఈత రావడంతో ప్రాణాలతో బయటపడింది. అయితే ఆమె పడిన తీరు అనుమానాస్పదంగా ఉందని పోలీసులు తెలిపారు. ఆమెకు సంబంధించిన సెల్‌ఫోన్, చెప్పులు, ఇతర వస్తువులన్నీ రిజర్వాయర్ ఆనకట్టపైనే ఉన్నాయి. కట్టపై కూర్చున్న సమయంలో కళ్లు తిరగడంతో ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయానని, ఈత రావడంతో తనను తాను కాపాడుకున్నానని ఆమె పోలీసులకు చెప్పింది. అయితే అక్కడ జరిగిన తీరు ఆమె చెప్పిన దానికి విరుద్ధంగా ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. నీటిలోనుంచి ఆమె కేకలు వేయడంతో ఆనకట్టపై ఉన్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సిబ్బందితోపాటు స్టేషన్‌లోనే ఉన్న మీడియా జర్నలిస్టు భూక్యా శ్రీనివాసరావుతోసహా సంఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే శ్రీనివాసరావు రిజర్వాయర్ నీటిలోకి దిగి పోలీసులు అందించిన తాడు సహాయంతో సౌజన్యను ఒడ్డుకు చేర్చారు. ఆ తర్వాత సౌజన్యను కుటుంబసభ్యులకు అప్పగించారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని చిననల్లబల్లి గ్రామ శివార్లలో గురువారం రూ.20వేల విలువైన యాభై లీటర్ల నాటుసారాను ఎస్ఐ గణేష్ పట్టుకున్నారు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో సుజ్ఞానపురానికి చెందిన భూక్యా బాబూరావు తన ద్విచక్రవాహనంపై సారాను తరలిస్తూ పట్టుబడ్డాడు. నాటుసారాతోపాటు ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీన పర్చుకున్నారు. ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి కౌలు రైతు ఆత్మహత్య

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 22: పురుగుమందు తాగి కౌలు రైతు మృతి చెందిన సంఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసునమోదైంది. రఘునాథపాలెం మండలం, గణేశ్వరం గ్రామానికి చెందిన కొర్ర నరేష్ (33) ఖమ్మంరూరల్ మండలం, తీర్థాల పరిధిలో రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని మిర్చి సాగుచేశాడు. పంటకు తెగుళ్లు సోకి పంట అంతా ఎండిపోవడంతో మిర్చి పంటను తొలగించి పెసర సాగుచేశాడు. పెసర పంట కూడా ఆశాజనకంగా లేదు. వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పుల బాధతాళలేక బుధవారం తీర్థాలలో తాను సాగుచేస్తున్న పంట చేలో పురుగుమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసునమోదు చేశారు.

సరిహద్దులో రక్తపు మరకల కలకలం

వేంసూరు, ఫిబ్రవరి 22: ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కుంచపర్తి, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం నూతిపాడు సరిహద్దు ప్రాంతం వద్ద కల్వర్టుపై గురువారం ఉదయం రక్తపు మరకలు కలకలం సృష్టించాయి. దీంతో కుంచపర్తి, నూతిపాడు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం వెళ్లడంతో తెలంగాణ-ఆంధ్రా రాష్ట్రాలకు చెందిన పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. ఇది కేవలం జంతు బలిగానే పలువురు భావిస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభచూపిన ఆదివాసీలు

- ఐదో జాతీయ అథ్లెటిక్స్‌లో పతకాల సాధన
- అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు
- స్పాన్సర్ల కోసం ఎదురుచూపులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 22: వీరంతా అడవి బిడ్డలు. పేద ఆదివాసీ కుటుంబ నేపథ్యం వీరిది. ఆర్థిక, మౌలిక వసతులు అంతంత మాత్రమే. అయినా.. మెరుగైన శిక్షణ లేకుండానే క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చారు పత్తిపాకకు చెందిన అపకా సతీష్, సింగారానికి చెందిన నూపా చిట్టిబాబు, కల్లూరి భద్రయ్యలు. హైదరాబాదులో ఈనెల 8నుంచి 11 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలను ఒడిసిపట్టారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 1700మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, మండలానికి ఐదు పతకాలను సాధించారు.

మండలానికి పతకాల పంట

థర్టీ ప్లస్ విభాగంలో పత్తిపాకకు చెందిన అపకా సతీష్ 200 మీటర్ల పరుగుపందెంలో గోల్డ్‌మెడల్, వంద మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్‌ను సాధించాడు. అలాగే పోల్ ఈవెంట్ విభాగంలో సింగారానికి చెందిన నూప చిట్టిబాబు సిల్వర్ మెడల్ సాధించాడు. వీరిరువురూ డిగ్రీ విద్యను పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే సింగవరానికి చెందిన టీచర్ కల్లూరి భద్రయ్య 40ప్లస్ విభాగంలో లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్‌ను సాధించాడు. అస్సాం రాష్ట్రం గౌహతిలో 2018లో జరిగిన నేషనల్ మీట్ 200మీటర్ల పరుగుపందెంలో నాలుగో స్థానం సాధించాడు. అలాగే 2023లో హైదరాబాదులో నిర్వహించిన మాస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30ప్లస్ 200 మీటర్ల పరుగుపందెం నేషనల్ మీట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. హైదరాబాద్‌లో పలు రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం పాల్గొన్న సతీష్ పలు పతకాలను సాధించాడు. అలాగే నూపా చిట్టిబాబు సైతం రాష్ట్రంలో పలుచోట్ల నిర్వహించిన అథ్లెటిక్స్‌లో మంచి ప్రతిభ కనబర్చడంతోపాటు పతకాలు సాధించాడు.



మెడల్స్ సాధించిన అపకా సతీష్, చిట్టిబాబు

స్పాన్సరర్ల కోసం ఎదురుచూపులు

శ్రీలంకలో మే 3 నుంచి 8 వరకు జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ మీట్‌కు అపకా సతీష్, నూపా చిట్టిబాబులు ఎంపికయ్యారు. పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 25లోగా రిజిష్టర్ చేసుకోవాలని నిర్వహణ సంస్థ సమాచారం ఇచ్చింది. క్రీడల్లో పాల్గొనేందుకు ఒక్కొక్కరికి రూ.70వేల వరకు ఖర్చు కానుంది. వీరివురూ పేదవారు కావడంతో ఎవరైనా దాతలు సహకరిస్తే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొంటామని తెలిపారు. ఇప్పటికే ఈ ఆదివాసీ క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు సాధన ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొస్తే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటామని, సాయం చేయదల్చిన వారు 9347296436 సెల్ నంబర్లో సంప్రదించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

యథేచ్ఛగా టేకు కలప స్మగ్లింగ్

కొరవడిన అటవీ సిబ్బంది పర్యవేక్షణ

దుమ్ముగూడెం ఫిబ్రవరి 22: దుమ్ముగూడెం అటవీరేంజ్ పరిధి దుమ్ముగూడెం గోదావరి హెడ్‌లాకుల ప్రాంతం, కాశీనగరం ఎత్తిపోతల పథకం ప్రాంతాల నుంచి కొద్ది రోజులుగా టేకు దిమ్మెల స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతోంది. గురువారం తెల్లవారుజామున మూడు ద్విచక్రవాహనాలపై టేకు దిమ్మెలను దుమ్ముగూడెం గోదావరి ఒడ్డు ప్రాంతానికి కొందరు స్మగ్లర్లు తరలించారు. అక్కడినుంచి గోదావరి నదిలో పడవ ద్వారా అశ్వాపురం మండలానికి చేరవేశారు. కొద్ది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో రెండు ద్విచక్రవాహనాలు, టేకు దిమ్మెలను రేంజి సిబ్బంది కాపుకాసి పట్టుకున్నప్పటికీ, స్మగ్లింగ్ ఆగలేదు. అలాగే ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం వద్ద పట్టపగలే టేకు దిమ్మెలను గోదావరి ఒడ్డుకు తరలించి అక్కడినుంచి పడవల ద్వారా కుమ్మరిగూడెం రేవుకు చేరుస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మండలంలోని పలుచోట్ల దాడులు నిర్వహించి టేకు కలపను పట్టుకున్నారు. అయితే స్మగ్లింగ్ వ్యవహారంపై స్థానిక అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉందా? లేక స్మగ్లర్లతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు స్థానికుల్లో కలుగుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి

● బీజేపీ క్రమశిక్షణ కమిటి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

ఖమ్మం బైపాస్‌రోడ్, ఫిబ్రవరి22: తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన పీడ వదిలిందని బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్ర రాజకీయాలను మార్చే ఎన్నికలను, బీజేపీ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుందనన్నారు. బీజేపీ అధికారంలో ఉండాలని అన్నివర్గాలు కోరుకుంటున్నాయని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పది సీట్లు బీజేపీ కైవసం చేసుకోబోతుందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దిగజారిపోయిందని, సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే ఢిల్లీవైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కలిసి నాటకాలాడుతున్నాయని ఆరోపించారు. ఈనెల 25నుంచి వచ్చే నెల 2వరకు భద్రాచలం నుంచి జనగామ వరకు ఈ రథయాత్ర సాగనుందన్నారు. మొదటగా పది నియోజకవర్గాల్లో కార్నర్ మీటింగ్ జరగనుందని, ఈ మీటింగ్‌లకు ఛతీస్‌ఘడ్ సీఎం విష్ణుదేవ్ సాహుతో పాటు కేంద్ర మంత్రులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈసమావేశంలో పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, సన్నె ఉదయ్‌ప్రతాప్, గంటేల విద్యాసాగర్, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, వినోద్‌రావు, చాడా శ్రీనివాసరెడ్డి, రామలింగేశ్వరావు పాల్గొన్నారు.

'అవకాశాలను అందిపుచ్చుకోవాలి'

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 22: నేటి కాలంలో ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మద్దులపల్లి సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి అన్నారు. డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ప్రతిభా పాటవాలపై నిర్వహిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన మెలకువలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టాస్క్ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. విద్యారంగంలో వస్తున్న సవాళ్లు, వాటిని ఎదుర్కోవడానికి ఉన్న మార్గాల గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ప్రతినిధులు ఆంటోని డిసౌజా, అరుణ, స్వప్న, తేజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దమ్మపేటలో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వులు

దమ్మపేట, ఫిబ్రవరి22: దమ్మపేటలో కోర్టు ఏర్పాటు చేయవల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఉత్తర్వులు ప్రకారం ఇల్లందు మండల కేంద్రంలో ఉన్న అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును దమ్మపేటకు బదిలి చేశారు. ఇప్పటికే దమ్మపేటలో కోర్టు ఏర్పాటుకు కావలిసిన భవన సముదాయాన్ని అధికారులు సిద్ధం చేసినట్లు సమాచారం. మార్చి మొదటి వారంలో కోర్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఈమేరకు ఉత్తర్వులు రావడంతో అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. దమ్మపేటలో కోర్టు ఏర్పాటైయితే కోర్టు పనుల కోసం కొత్తగూడెం వెళ్లకుండా ఇబ్బందులు తప్పుతాయని అంటున్నారు.

25నుంచి సీవోఈ ఇంటర్ ప్రవేశ పరీక్షలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 22: తెలంగాణ సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని ప్రత్యేక గురుకులాల్లో ప్రవేశాలకు నిర్వహించే సీవోఈ రెండో స్థాయి పరీక్షలను ఈనెల 25 ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఆర్సీవో ప్రత్యూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ, టేకులపల్లి, దన్వాయిగూగెం, ఖమ్మం అంబేద్కర్, మహబాద్ కాలేజీల్లో పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

లంకపల్లి పల్లె దవాఖాన తనిఖీ



ఆసుపత్రి పరిశీలనలో పాల్గొన్న కేంద్ర బృందం సభ్యులు

పెనుబల్లి, ఫిబ్రవరి 22: మండలం లోని లంకపల్లి పల్లెదవాఖానాను గురువారం జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ ప్రతండ గుంజాల్, డాక్టర్ రాజేష్ ఆరాస్ట్ పరిశీలించారు. పల్లె దవాఖానాలో ముఖ్యమైన ఏడు విభాగాలైన గర్భిణులకు, చిన్న పిల్లలకు అందించే సేవలు, కుటుంబ నియంత్రణ, యుక్తవయస్సు పిల్లలకు అందించవల్సిన సేవలు, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు, రక్తపరీక్షలు వాటి నివేదికల గురించి అందుబాటులో ఉన్న ఔషధాలు, వాటి లభ్యత గురించి, రోగులకు అందుతున్న చికిత్స, నాణ్యతా వివరాల గురించి, ఆసుపత్రి భవనం, అందుబాటులో ఉండాల్సిన పరికరాలు వాటి పనితీరును, పాటించవల్సిన శుభ్రత వివరాలు, సిబ్బంది పనితీరు, 14జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి ఉన్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం పర్యవేక్షణలో బృందంతో పాటు లంకాసాగర్ వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సౌమ్య, ఎంఎల్‌హెచ్‌సీ అలేఖ్య, క్వాలిటీ మేనేజర్ ఉపేందర్, బయోమెడికల్ ఇంజనీర్ ఇస్లావత్‌రెడ్డి, హెచ్‌ఈవో శ్రీనివాస్, హెచ్‌ఎస్‌లు ప్రకాశరావు, నాగేశ్వరరావు, నిర్మలకుమారి, కిరణ్, శ్రీనివాస్, ఫార్మాసిస్టు కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కూసుమంచి, ఫిబ్రవరి 22: మండలంలోని పాలేరు పెట్రోల్ బంకు వద్ద ఈనెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంపై బాధితులు పోలీసులు కేసు నమోదు చేశారు. కిష్టాపురం గ్రామానికి చెందిన అల్లం ఉపేందర్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి పెట్రోల్ బంకు వద్ద తన బైక్ నిలిపి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈక్రమంలో చౌటపల్లి నామతండాకు చెందిన భూక్యా బీక్షం తన ఆటోతో అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తనకు, తన భార్యకు గాయాలయ్యాయని తెలిపారు. ఆటో డ్రైవరుపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోదీ సర్కారు మూల్యం చెల్లించుకుంటుంది...

● ఆందోళన చేస్తున్నరైతులపై కాల్పులు హేయం

● నగరంలో ఐక్య నిరసన, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్యయుతంగా ఢిల్లీ సరిహద్దులో నిరసన చేపడుతున్న రైతులపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బుల్లెట్‌లను దించి ఓ రైతు మరణానికి కారణమైందని, రైతులపై పడే ప్రతి లాఠీ దెబ్బకు బుల్లెట్ తూటాకు మోదీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకొనే పరిస్థితి వస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినెపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు మాదినేని రమేష్, ఎస్సీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ స్పష్టంచేశారు.

వామపక్ష రాజకీయ పార్టీలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో ఐక్య నిరసన ర్యాలీ నిర్వహించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వ్యవసాయ రంగంలో అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలో రైతులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు సంఘీబావం తెలిపారు. ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ కూడలిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వర్లు, జీ రామయ్య, ఆవుల అశోక్, ఎస్‌కే మీరా, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, మంగతాయి, ఝాన్సీ, రామకృష్ణ, శ్రావణ్, మందా వెంకటేశ్వర్లు, ఆజాద్ పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి: కాంగ్రెస్

హర్యానాలో పోలీసులు జరిపిన కాల్పుల్లో రైతు శుభకరన్ సింగ్ మరణించారని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని టీపీసీసీ సభ్యుడు జావీద్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతుల నిరసన దీక్షలకు జిల్లా కాంగ్రెస్ తరఫున సంఘీబావం తెలుపుతూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మందుబాబులకు షాక్

● బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 594మందిపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 22: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 594మందిపై సిటీ పోలీసుయాక్టు కింద కేసు నమోదు చేసినట్టు పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీసుయాక్టు అమల్లో ఉందని, బహిరంగ మద్యపానం, ర్యాష్‌డ్రైవింగ్, సమయానికి మించి షాపులు తెరవడం, బర్త్‌డేల పేరుతో రోడ్లపై వాహనాలు అడ్డుపెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై సిటీ పోలీసు యాక్టు అమలుచేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు. ప్రధానంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. రాత్రివేళలో నిర్జన ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ వీధుల్లో సంచరించడం, ప్రజలను ఇబ్బంది పెట్టడం, వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఘర్షణలకు దిగడం, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించడం వంటి చర్యలకు దిగే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు.

నత్తనడకన 'ప్రసాద్' పనులు

● 9 నెలల క్రితం రాష్ట్రపతి శంకుస్థాపన

● పర్ణశాలలో ఇంకా ప్రారంభం కాని వైనం

● మూడు నెలల్లో ముగియనున్న ఒప్పందం



మిథిలా స్టేడియం వద్ద పిల్లర్ల దశలోనే ఆగిపోయిన పనులు

భద్రాచలం, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలో ప్రసాద్ పథకం (తీర్థయాత్రల పునర్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి పథకం) కింద చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. తొమ్మిది నెలలు పూర్తవుతున్నా కేవలం భద్రాచలంలోని మిథిలా స్టేడియం పక్కన ఉన్న ప్రాంతంలో అభివృద్ధి పనులను చేపడుతుండగా, పర్ణశాలలో ఇంత వరకు పనులు ప్రారంభం కాకపోవడంపై రామ భక్తులు విమర్శిస్తున్నారు. 9నెలల కాలలో కేవలం 3 శాతం పనులు జరగడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భద్రాచలంలో చేపట్టాల్సిన పనులివే ...

వాస్తవానికి ప్రసాద్ పథకం కింద రూ.41.38 కోట్ల తో అభివృద్ధి పనులు భద్రాచలం, పర్ణశాలలో చేపట్టాల్సి ఉంది. ఇందులో రూ.22 కోట్లతో సివిల్ వర్క్స్ చేపడుతున్నామని పర్యాటక శాఖ ఇంజనీరింగు అధికారు లు పేర్కొంటున్నారు. మౌలిక వసతులు, డిజిటల్ ప్రొజెక్షన్ రూము కోసం రూ.6.94 కోట్లతో గ్రౌండ్+1 నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అలాగే వ్రతమండపం కోసం రూ.3.51 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది.. అదే విధంగా గోదావరి నదీతీరంలో మహిళ భక్తులు దుస్తులు మార్చుకునేందుకు రూ.42.60 లక్షలతో తాత్కాలిక షెడ్‌లు నిర్మాణం. అదేవిధంగా భద్రాచలం పట్టణ ప్రారంభంలో సారపాక వద్ద స్వాగత ద్వారం రూ.73.93 లక్షలతో నిర్మించాల్సి ఉంది. అలాగే బ్యాటరీ కార్ల కోసం రూ.16.30 లక్షలతో కొనుగోలు చేయాల్సి ఉంది. ఇవే కాకుండా రామాలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపం, ఆంజనేయ స్వామి, ఆలయ మెట్ల వద్ద పర్ణశాల ఆలయంలో ఫ్లోరింగ్ మార్పు కోసం రూ.1.21 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా ఆలయ నిత్యకల్యాణ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, మిథిలా స్టేడియం ఇతరత్రా చోట్ల సుమారు రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉంది. ఇవే కాకుండా ప్రసా దం తయారీకి అధునాతన మిషన్లను రూ.69.60 లక్షలతో కొనుగోలు చేయాల్సి ఉంది. ఇలా ఎన్నో పనులను ప్రసాద్ పథకంలో చేపట్టాల్సి ఉంది.

నేటికీ పూర్తయ్యింది మూడు శాతమే..,

ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనులను నత్తనడకన సాగుతున్నాయి. 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలు ఆయా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 2023 జూన్‌లో ఒప్పందం చేసుకోగా ఇంత వరకు కేవలం మూడు శాతం పనులే పూర్తవడం గమనార్హం. ఇప్పటి వరకు కేవలం 3 శాతం పనులే పూర్త వ్వడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్ణశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్‌లు సిద్ధంగా ఉండగా వాటిని రెండు రోజుల్లో చేపట్టబోతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నారు. మరో మూడు నెలల్లో కాంట్రాక్టర్ ఏడాది ఒప్పందం ముగుస్తున్న క్రమంలో పనులు పూర్తికావాలంటే మరో ఏడాది సమయం పట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఇందుకోసం ఉన్నతాధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

> **పనుల్లో జాప్యం వాస్తవమే**
>
> ప్రసాద్ పథకం పనుల్లో కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్న మాట వాస్తవమే. అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని మేము ఎంతో ఒత్తిడి తెస్తున్నాం. అయినా పనుల్లో వేగం పెరగడం లేదు. మరో మూడు నెలల్లో గడువు ముగుస్తున్న క్రమం లో ఉన్నతాధికారుల అనుమతితోనే సంబంధిత కాంట్రాక్టర్‌కు గడువు పొడిగించే అవకాశం ఉంటుంది.
>
> ● ప్రసాద్, ఏఈ పర్యాటక శాఖ

రైతుల అభివృద్ధికి 'ప్రైవేట్' భాగస్వామ్యమూ కావాలి

● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

● సుజాతనగర్‌లో విత్తన పరిశోధన క్షేత్రం పరిశీలన



టమాట పంటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి ప్రభుత్వ కృషితో పాటు, ప్రైవేటు భాగస్వామ్యమూ ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు పండించిన పంటలకు కావాల్సిన ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీ సౌకర్యాలను కల్పించాలన్నారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌లో రవి హైబ్రిడ్ సీడ్స్ విత్తన పరిశోధనాభివృద్ధి కేంద్రాన్ని మంత్రి గురువారం సందర్శించారు. టమాట, మిరప పంటలను పరిశీలించి రవి సీడ్స్ అధినేత మన్నేపల్లి రవిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ కావాలనుకున్న రవి వ్యవసాయంపై మక్కువతో తనకున్న 45 ఎకరాల పొలాన్ని విత్తన పరిశోధనా కేంద్రంగా మార్చి నేడు దేశ వ్యాప్తంగా కూరగాయల విత్తనాల్లో ముఖ్యంగా మిర్చి సుమారు 3వేల రకాలు, టమాట 450రకాలను తన క్షేత్రంలో అభివృద్ధి చేసి రైతులకు అందిస్తున్నారని అభినందించారు. దేశంలో వివిధ ప్రాంతాలకు అవసరమైన విత్తనాలపై పరిశోధించి వేల రకాల విత్తనాలు అందిస్తున్న రవి, అతడి కుమారుడు హర్ష అభినందనీయులన్నారు. రైతులు పండించిన పంటలకు కావల్సిన స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెటింగ్ సదుపాయాలను అన్వేషించే బాధ్యత అధికార యంత్రాంగంతో పాటు ప్రైవేట్ కంపెనీలపై కూడా ఉందన్నారు. రవి సీడ్స్ అధినేత మన్నేపల్లి రవి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించిన రైతులకు ఎన్టీఆర్ స్మారకంగా ప్రతి సంవత్సరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా 'ఎన్టీఆర్ రైతుమిత్ర' అవార్డులను ప్రతి సంవత్సరం ముగ్గురు రైతులకు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, నాగా సీతారాములు, నూకల రంగారావు, రైతు నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ జీనుగు మరియన్న, ఏడీఏ కరుణశ్రీ, ఏవో నర్మద, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోలార్‌లో భద్రాద్రి రామయ్య పట్టాభిషేకం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాతలు

భద్రాచలం, ఫిబ్రవరి 22: కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌లో భద్రాచలంలోని సీతారామచంద్రస్వామికి గురువారం పట్టాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పుష్యమి నక్షత్రం సమయాన భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా సంకల్పం, పుణ్యాహవచనం, కలశా వాహన, అష్టదిక్పాలక ఆవాహన, రామాయణంలోని పట్టాభిషేక ఘట్ట పారాయణం, పట్టాభిషేక వైభవ వివరణ, జలప్రోక్షణ, వేద ఆశీర్వచనం, మంగళ హారతితో పట్టాభిషేక కార్యక్రమం పరిసమాప్తి అయ్యింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది శ్రీకాంతాచార్యులు, దేవస్థానం సిబ్బంది శ్రీనివాసరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా భద్రాచలంలోని రామాలయంలో సైతం పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించారు. ఇదిలా ఉండగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మారుతీ సదనంలో 32 ఏసీ గదులు గురువారం నుంచి భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు దేవస్థానం అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఒక ఏసీ గది రూ.1,300తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత నిత్యాన్నదానానికి ఏపీలోని నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన పమిడిగంటం వెంకటరమణమూర్తి, మధుస్మితలు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు లింగాలసాయిబాబాకు అందజేయగా ఆయన దేవస్థానం బాండ్‌ను అందజేశారు.

బ్యాంకర్లు రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు నిర్దేశించిన విధంగా రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు, గురువారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యాల పురోగతిపై ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

జిల్లాలో మొత్తం రూ.5,599.03 కోట్ల రుణ లక్ష్యం కాగా, అందులో ఇప్పటి వరకు 4,175.83 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు అధికారులు ఆమెకు తెలిపారు. అందులో వ్యవసాయానికి 4,309.54 కోట్లుకు గాను 1,923.91 కోట్లు, స్మాల్ స్కేల్ పరిశ్రమలకు 426.55 కోట్లకు గాను 377.32 కోట్లు, విద్యారంగానికి 202.80 కోట్లకు గాను 7.45 కోట్లు, గృహ నిర్మాణానికి 536.22 కోట్లకు గాను 12.26 కోట్లు, ఇతర మౌలిక వసతులకు 50.02 కోట్లకు గాను రూ. 91.65 మొత్తం ఇప్పటి వరకు మంజూరు చేయబడిందని తెలిపారు. బ్యాంకర్లు వివిధ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ త్వరితగతిన లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకర్లకు ఆదేశించారు. రుణ లక్ష్యాలకు సంబంధించిన వివరాలపై బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, ఎల్డీఎం రామిరెడ్డి, నాబార్డు డీడీఎం సుజిత్, పరిశ్రమల అధికారి తిరుపతయ్య, బ్యాంకుల రీజనల్ మేనేజర్లు, పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలి: ఆర్జేడి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడి సత్యనారాయణరెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 22: పదోతరగతి వార్షిక పరీక్షలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్జేడి సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని నయబజార్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అదనపు సమయాన్ని కేటాయించాలని, అవసరమైతే ఆదివారాలు పాఠశాలలకు వచ్చి బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కామేపల్లి: మండల పరిధిలోని కొమ్మినేపల్లి హైస్కూల్‌ను వరంగల్ రీజియన్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. పదోవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ తనిఖీలో హెచ్ఎం జ్యోతి, రచ్చశ్రీనివాస్, బి. రవికుమార్, వెంకటేశ్వర్లు, ఉషారాణి, శ్రీనివాసరెడ్డి, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రదీప్‌కుమార్, దయాకర్‌రెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్, ఫిబ్రవరి 22: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం ఖమ్మం ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. 9 రోజులు పాటు జరగనున్న ఈ టోర్నీలో 8ఫ్రాంచైజీ జట్లు పాల్గొనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.2లక్షలు, రెండో బహుమతి రూ.1లక్ష అందజేయనున్నారు. తొలిరోజు పోటీలను టోర్నీ ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు కూరపాటి ప్రదీప్‌కుమార్, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, మంత్రి పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. టోర్నీ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో డేనైట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను స్నేహభావంతో నిర్వహించుకోవాలని అన్నారు. గెలపోటములు సహజమని అని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వేముల వెంకట్, బాణాల లక్ష్మణ్, మతిన్, నరాల నరేష్, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, గుర్రం సుమంత్, శ్రీకాంత్, ఓలేటి సాంబమూర్తి ఉన్నారు.

'అమృత్‌కాల్' వర్క్‌షాప్‌నకు డీసీసీబీ చైర్మన్



కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్‌కాల్ పథకంలో భాగంగా దేశంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అభివృద్ధిపై నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్‌కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్(ఎన్‌ఏఎఫ్‌ఎస్‌సీఓబీ) ఆధ్వర్యంలో బెంగుళూరులో గురువారం నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య హాజరయ్యారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌క్యూఏఎస్‌కు ఐదు సబ్ సెంటర్ల ఎంపిక

సుజాతనగర్, ఫిబ్రవరి22: నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) ప్రోగ్రాం లో భాగంగా జిల్లాలో నేషనల్ టీమ్స్ పర్యటించి 5 సబ్ సెంటర్లను ఎంపిక చేశాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. గురువారం స్థానిక పాత అంజనాపురం సబ్ సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు. పాత అంజనాపురం సబ్ సెంటర్‌కు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు లభిం చిందని తెలిపారు. అదే విధంగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం (పీహెచ్సీ ఎంపీ బంజర), సీతారాంపురం (పీహెచ్సీ రేగళ్ల), చాతకొండ-1 (పీహెచ్సీ రేగళ్ల), సింగభూపాలెం (పీహెచ్సీ సుజాతనగర్), పాత అంజనాపురం (పీహెచ్సీ సుజాతనగర్) అన్నీ కూడా నేషనల్ గైడ్లైన్స్ ప్రకారం మెయింటైన్ చేస్తున్నాయని తెలిపారు. ఈ ఆరోగ్య ఉప కేంద్రాలలో కమ్యూనిటి లెవల్ లో అందరికీ సేవలు అందే విధంగా జిల్లా ఎన్‌క్యూఏఎస్ బృందం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ ఆఫీసర్ డాక్టర్ స్పందన, క్వాలిటి మేనేజర్ శృతి, ల్యాబ్ టెక్నీషియన్ ఎబినైజర్, ఫార్మాసిస్టు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీల పేరుతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

● కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి




సంకల్పయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

మధిర, ఫిబ్రవరి 22: తెలంగాణలో గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసగిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మధిరలో నిర్వహించిన బీజేపీ విజయసంకల్పయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా నరేంద్రమోదీకి ప్రజల మద్దతు కూడకట్టాలని సూచించారు. ఈ యాత్ర 26న మధిరలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఈసమావేశంలో మధిర అసెంబ్లీ ఇన్‌చార్జి ఏలూరు నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, మండల అధ్యక్షుడు గుండా చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింక్ క్లిక్..డబ్బులు మాయం

కూసుమంచి, ఫిబ్రవరి 22: ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తికాల్ చేసి లోన్ కట్టాల్సి ఉందని, లేదంటే న్యూడ్ ఫోటోలు తయారు చేసి ఫోన్ కాంటాక్ట్‌కు పంపిస్తానని బెదిరించి వాట్సాప్‌లో లింక్ పంపగా దానిని క్లిక్ చేయడంతో డబ్బులు గల్లంతయిన సంఘటన వెలుగుచూసింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కందుల ఉపేందర్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 13న 923256 742895 నెంబరు నుంచి గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశారు. తాను 23,500 లోన్ కట్టాల్సి ఉందని వాట్సాప్ లింక్ పంపిస్తున్నానని, లింక్ ఓపెన్ చేస్తే ఆటోమేటిక్‌గా అమౌంట్ కట్ అయిపోతుందని, లోన్ కట్టనిచో తన న్యూడ్ ఫోటోలు ఫోన్ కాంటాక్ట్స్ పంపిస్తానని బెదిరించాడు. దీంతో ఉపేందర్ భయపడి పరువుకు సంబంధించిన విషయం కావడంతో వెంటనే వాట్సాప్‌కు వచ్చిన లింకు ఓపెన్ చేశాడు. దీంతో వెంటనే యూనియన్ బ్యాంకు నుంచి రూ.23,500 కట్టయ్యయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మళ్లీ వెంటనే కాల్ వచ్చిందని మరో రూ.50వేలు పంపించాలని చెప్పడంతో, భయపడి 1930 కాల్ చేసి జరిగిన విషయాన్ని ఫిర్యాదు చేశాడు. వివరాలు అడిగిన అధికారులు వెంటనే ఖాతాను హోల్డ్‌లో పెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గురుకుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ఏన్కూరు, ఫిబ్రవరి22: ఏన్కూరు గురుకుల పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హామీ ఇచ్చారు. గురువారం పాఠశాలలో సీసీరోడ్డు, ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కృషి, పట్టుదలతో చదివి సమాజంలో పేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని విద్యార్థులను కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి, డీఈ వైకుంఠచారి, ఏన్కూరు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్లు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, నాయకులు వేముల కృష్ణప్రసాద్, మేడ ధర్మారావు, భూక్యా లాలునాయక్, బాదావత్ బాలాజీ, వాసిరెడ్డి నాగేశ్వరరావు, దళపతి భువనేశ్వరరాజు, స్వర్ణ ప్రహ్లాదరావు, పూర్ణకంటి మైసారావు పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

మధిరటౌన్, ఫిబ్రవరి22: మధిర రైతుసేవా సహకార సంఘంలో సభ్యులు మృతి చెందటంతో గురువారం మధిరలోని సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్ బీమాచెక్కులు అందించారు. మల్లారం గ్రామానికి చెందిన చట్టు నాగమణి, వంగవీడు గ్రామానికి చెందిన సంగెపు వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మధిర డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ గోపిరెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రమాదేవి సేవలు మరవలేనివి

మధిరటౌన్, ఫిబ్రవరి22: మధిర మునిసిపల్ కమిషనర్‌గా దాదాపు మూడు సంవత్సరాలు విజయవంతంగా పనిచేసిన కమిషనర్ రమాదేవి సేవలు మరవలేనివని మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండి తోక లత అన్నారు. బదిలీపై వెళుతున్న రమాదేవిని గురువారం మధిర మునిసిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్, కమిషనర్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ షఫీఉల్లా, వైస్‌చైర్‌పర్సన్ శీలం విద్యాలత, మేనేజర్ రవీంద్ర, టీపీఓ రమేష్, ఏఈ నరేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు వైరాలో కరెంట్‌కోత

వైరా, ఫిబ్రవరి 22: వైరా పట్టణంలోని రెండో ఫీడర్ పరిధిలో శుక్రవారం కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఏఈ ఎస్ఎస్ఎస్.కుమార్ తెలిపారు. రెండో ఫీడర్ పరిధిలోని మాటూరుపేట కాలనీ, సంత బజార్, హనుమాన్‌బజార్, శాంతినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు. ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

చింతకాని,ఫిబ్రవరి22: మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎంపీపీ పూర్ణయ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు బందెల నాగార్జున, ఎంపీటీసీ ఓర్సు వీరభద్రం, సట్టు వెంకటేశ్వర్లు, పానకాల రాంబాబు, కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన గెజిటెడ్ హెచ్‌ఎంలకు సన్మానం



సన్మాన గ్రహీతలతో బొర్రా రాజశేఖర్, జైపాల్

వైరా, ఫిబ్రవరి 22: ఉద్యోగోన్నతి, బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను పీఆర్టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ పాల్గొన్నారు. చావా శ్రీనివాసరావు, మాధవరావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, దొంతెబోయిన సత్యనారాయణ, కూరాకుల సైదయ్య, పొదిల పద్మ, శాంతారెడ్డిని సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలిశెట్టి నర్సింహారావు, రంగారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అమృత కుమార్, జిల్లా కార్యదర్శులు దయాకర్‌రావు, పాటి రామచంద్రయ్య, వైరా బాలికోన్నత, గొల్లపూడి హెచ్‌ఎం మల్లేశ్వరి, విజయబాబు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

బోనకల్, ఫిబ్రవరి 22: మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్యాడ్లను ఎస్ఐ మధుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు దామాల పుల్లయ్య, సిహెచ్. వెంకటేశ్వరావు, డీవైఎఫ్ఐ నాయకులు గుగులోతు నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ ఏర్పాటు

చింతకాని, ఫిబ్రవరి22: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కురుగుంట్ల పెద్ద సైదారెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలోని అంబేద్కర్‌నగర్‌లో తాగునీటి కొరకు బోర్‌ను ఏర్పాటు చేశారు. వారిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో కురుగుంట్ల రవీందర్, సకినాల అంజయ్య, నరసింహరావు, హుస్సేన్, జయరాజు, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ఐయిపాయే.. నిధులు రాకపాయే!

- అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లు
- నేటికీ రాని రూ.2కోట్ల బిల్లులు
- చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయం



ఎన్నికల పనుల్లో భాగంగా బుర్హాన్‌పురం పాఠశాలకు రంగులు వేసిన దృశ్యం

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి22: గతఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పనులను నగర పాలకసంస్థకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించారు. సుమారు రూ.2కోట్ల వ్యయంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనులు చేయించారు. సదరు పనులను టెండర్ల ద్వారా కాకుండా కొంతమంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఎన్నికల సందర్భంగా వారిని హడావుడి పెట్టి పనులు చేయించారు. సుమారు 10మంది కాంట్రాక్టర్లు రూ.2కోట్లకు పైగా విలువైన పనులను చేశారు. ఎన్నికలు ముగిసి మూడునెలలు కావస్తున్నా, ఇంతవరకు వారికి బిల్లులు రాలేదు. దీంతో కాంట్రాక్టర్లపై ఆర్థికభారం పడగా, చిన్నకాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌బీఎఫ్) వస్తాయని గతంలో కాంట్రాక్టర్లతో రూ.22కోట్ల విలువైన పనులు చేయించారు. ఆ బిల్లులు పెండింగ్‌లో పడగా, ప్రస్తుతం ఎన్నికల పనుల బిల్లులు కూడా పెండింగ్‌లో పడటంతో మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లు అయింది కాంట్రాక్టర్ల పరిస్థితి.

ఎన్నికల సందర్భంగా పలుపనులు..

ఎన్నికల సందర్భంగా టెంట్లు ఏర్పాటు, సిబ్బందికి భోజనాలు, పోలింగ్ బూతుల ఏర్పాటు తదితర పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. కాగా పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసిన కొన్ని పాఠశాలల్లో ప్రహరీగోడలు లేకపోవటంతో, ఎన్నికల పనుల్లో భాగంగా ప్రహరీగోడలను నిర్మించే పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అలాగే పలు పోలింగ్‌బూతుల వద్ద టాయ్‌లెట్లు లేకపోవటంతో వాటిని నిర్మించారు. వడ్డీలకు సొమ్ములు తెచ్చి పనులు చేస్తే బిల్లులు పెండింగ్‌లో ఉంచారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాదిరూపాయలకు రాకపోవటంతో తాము రోడ్లపై పడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు.

కమిషనర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు

ఎన్నికల పనుల బిల్లులను చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టర్లు ఇటీవల నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభిని కలిశారు. బిల్లులు రాకపోవటంతో తాము ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నామని వివరించారు. అందుకు స్పందించిన కమిషనర్ ఎన్నికల పనులకు సంబంధించిన బిల్లులు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకుంటే నగర పాలకసంస్థ సాధారణ నిధుల నుంచి ఇచ్చేందుకు అనుమతి తీసుకుంటామని చెప్పారన్నారు.

ఆ రహదారిపై చిగురిస్తున్న ఆశలు

జగ్గయ్యపేట-వైరా- కొత్తగూడెం రోడ్డు జాతీయ రహదారిగా ప్రకటించేనా?

వైరా, ఫిబ్రవరి21: చిరకాలంగా ఎదురు చూస్తున్న జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం రోడ్డు అప్‌గ్రేడ్‌పై స్థానికులు ఆశలు చిగురిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మల్లుభట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి ఈ రోడ్డును అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు అందజేశారు. రాష్ట్రంలోని పలు కీలకమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని రేవంత్‌రెడ్డి, మంత్రులు చేసిన విజ్ఞప్తిలో జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం రోడ్డు కూడా ఉంది. వంద కిలోమీటర్లు ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాలని వారు విన్నవించారు. ఉమ్మడి ఏపీలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరాయి. వంద కిలోమీటర్ల ఈరోడ్డులో తెలంగాణ పరిధిలో 80కిలోమీటర్లు, ఏపీ పరిధిలో 20కిలోమీటర్లు రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏపీలోని జగ్గయ్యపేట నుంచి తెలంగాణలోని బోనకల్ మండలం సరిహద్దు వరకు ఆరాష్ట్ర రోడ్డు 20 కిలోమీటర్లు ఉండగా ఇక అక్కడి నుంచి మిగిలిన 80 కిలోమీటర్ల రోడ్డు తెలంగాణలో ఉంది.



వైరా-జగ్గయ్యపేట రోడ్డు

పలు జాతీయ రహదారులకు ఉనుసంధానం

జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం, పాల్వంచ అలాగే సత్తుపల్లి, ఇల్లెందు ప్రాంతాలకు వేలాది భారీవాహనాల రాకపోకలు జరుగు తున్నాయి. పాల్వంచలోని కేటీపీఎస్ నుంచి యాష్‌ను అలాగే కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి ప్రాంతాల నుంచి బొగ్గు జగ్గయ్యపేటకు రవాణా జరుగుతుంది. జగ్గయ్యపేట నుంచి సిమెంట్ ఈ ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాలకు రవాణా అవుతుంది. వైరా-తల్లాడ మధ్య తొమ్మిది కిలోమీటర్లు రోడ్డు జాతీయ ప్రధాన రహదారిగా ఉంది. వైరా నుంచి జగ్గయ్యపేట 50 కిలోమీటర్లు, అలాగే తల్లాడ నుంచి కొత్తగూడెం 50 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ వంద కిలోమీటర్ల రోడ్డును జాతీయ ప్రధాన రహదారిగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. ఇది జాతీయ రహదారి అయితే ఏపీలోని జగ్గయ్యపేట సమీపంలో ఉన్న చిల్లకల్లు సమీపంలోని హైదరాబాద్-చెన్నై కోల్‌కత్తా జాతీయ రహదారికి అలాగే సూర్యాపేట-ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు, అలాగే నాగపూర్-అమరావతి హైవేకు, కొత్తగూడెం వద్ద విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారికి, వైరా-తల్లాడ వద్ద వైజాగ్ వెళ్లే జాతీయ రహదారికి అనుసంధానమవుతుంది. వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు కూడా పెరుగుతాయి. ఇంత కీలకమైన ఈ రోడ్డును సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్రమంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించి జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేస్తారనే ఆశాభావాన్ని రెండు రాష్ట్రాల్లోని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

లింక్‌రోడ్లతో గ్రామాలకు మహర్దశ

రూ.334 కోట్లు మంజూరు చేసిన భట్టికి రుణపడి ఉంటాం

మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మధిరటౌన్,ఫిబ్రవరి22: మధిర నియోజక వర్గంలో లింక్‌రోడ్ల నిర్మాణానికి రూ.334 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంత రావు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో భట్టి హయంలో మధిర రూపురేఖలు మారటం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, మధార్, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, బండారు నరసింహరావు, అద్దంకి రవి పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ మధుసుదన్ నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామేపల్లి, ఫిబ్రవరి22: ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసుదన్ నాయక్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. తగుసూచనలు చేశారు. పెండింగ్ సమస్యలు లేకుండా చూసుకోవాలని, విద్యార్థులకు సర్టిఫికెట్లు రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ సుధాకర్, డీటీ ఎన్‌బీ శంకర్, ఆర్ఐ సక్రూ, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్లు బావ్‌సింగ్, మదన్, రవి రికార్డు అసిస్టెంట్ కన్నమాల శ్రీను, రమేస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: పదిలో ఉత్తమ ఫలితాలు సాదించాలని జేసీ మధుసూదన్ నాయక్ విద్యార్థులకు సూచించారు. ఖమ్మంరూరల్ మండలం, జలగంనగర్‌లోని ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి వారిని సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్యాంసన్ పాల్గొన్నారు.

రైతులపై కాల్పులను నిరసిస్తూ ప్రధాని దిష్టిబొమ్మ దహనం

మధిర రూరల్: స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతుసంఘం జిల్లా నాయకుడు మందా సైదులు, మండవ ఫణీంద్రకుమారి, రాధాకృష్ణ, పడకంటి మురళీ, కుక్కా మోహన్‌రావు, పల్లికంటి విల్సన్, అంకె శివయ్య, పుచ్చకాయల కిషోర్, బాజినేని వెంకటనర్సయ్య, వాసిరెడ్డి పార్థసారథి పాల్గొన్నారు.

వైరా,ఫిబ్రవరి22: ఢిల్లీలో రైతులపై జరిపిన పోలీసు కాల్పులను నిరసిస్తూ మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేసి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, నాయకులు బాణాల శ్రీనివాసరావు,షేక్.జానిమియా,ఉద్దండు సాహెబ్, చెంగల ముత్తయ్య, బూర్గు జయరాజు, ప్రేమ్ కుమార్, నాగరాజు, బాణాల విశ్వనాథం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలో తిమ్మక్కపేటలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు కొమ్ముకోమటి నాగేశ్వరరావు, ఆర్.శివలింగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని కాచిరాజుగూడెంలో సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, లింగయ్య, మల్లయ్య, గురవయ్య, రామనాథం, వెంకటరమణ, నందిగామకృష్ణ, పుల్లయ్య, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు విమర్శించారు.

పెనుబల్లి: రైతుసంఘాల ఆధ్వర్యంలో గురువారం వీఎంబంజర్‌లో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొమ్మినేని సుధాకర్, గాయం తిరుపతిరావు, బీరెల్లి లాజర్, కొప్పుల వెంకటేశ్వరరావు, చిరంజీవి, నలమల ప్రతాప్, పొదిల భాస్కర్, తడికమళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల కేంద్రంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు దంతె బోయిన నాగేశ్వరరావు, ఏర్పుల రాములు, లెనిన్, ప్రజా పంథా నాయకులు ఎస్‌కే లాల్‌మియా, కొండే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని పాతసెంటర్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు.కార్యక్రమంలో అమర్లపూడి శరత్, రావుల రాజబాబు, దండు ఆదినారాయణ, కొలిక పోగు సర్వేశ్వరరావు, రమేష్, వెంకట్రావ్, భాషా, దంపా రాఘవులు, మారుతి శ్రీను, కట్ట హరికృష్ణ, పాల్గొన్నారు.

బోనకల్:మండలంలోని కలకోటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, యంగల కరుణాకర్, వెంకటమ్మ, సునీత, కోటి, రామకృష్ణ, జనార్దన్‌రావు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ దాతృత్వం



ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న హిజ్రాలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి22: తనకు ఉన్నదాంట్లోనే ఆపదలో ఉన్నవారికి, ఆదరణకు నోచుకొని వారికి సాయమందిస్తూ దాతృత్వం చాటుకుంటున్నాడు. సత్తుపల్లి మునిసిపాలిటీలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ కంభంపాటి కాంతారావు గురువారం అదేకాలనీకి చెందిన బత్తుల శ్రీనివాసరావు మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. క్వింటా బియ్యం ఉచితంగా అందజేశారు. అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను హిజ్రాల చేతులమీదుగా పంపిణీ చేశారు.

పంటల నమోదు పరిశీలన

పెనుబల్లి, ఫిబ్రవరి22: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని జేడీఏ ఎం.విజయనిర్మల గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ప్రసాదరాజు, క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి షర్మిదా, రైతు వంగాల జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచండి

కామేపల్లి, ఫిబ్రవరి22: నర్సరీలలో పండ్ల మొక్కలను, నీడనిచ్చే మొక్కలను పెంచాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్య ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని కొమ్మినేపల్లి, ముచ్చర్ల పంచాయలతీలను సందర్శించారు. కొమ్మినేపల్లిలో లచ్చయ్య కుంటలో పూడికతీత పనులను పరిశీలించారు. అక్కడ ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. నర్సరీని పరిశీలించారు. అనంతరం ముచ్చర్లలో జరుగుతున్న సీసీటీ వర్కులు చూసి కూలీలలకు కనీస వేతనం పడేలా చూడాలని సూచించారు. ఈ సందర్భనలో ఏపీఓ శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, ఫీల్డ్ అసిస్టెంట్ దారావత్ మాన్‌సింగ్, మంజుల పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



టీకాకార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారామ్

సత్తుపల్లి, ఫిబ్రవరి22: 9రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడేందుకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తలారి సీతారామ్ సూచించారు. గురువారం సత్తుపల్లిలో ఆయన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. హెపటైటిస్-బీ, బీపీటీ, పోలియో, మిజిల్స్, పెంటావాలెంట్ టీకాలు తప్పకుండా చిన్నారులకు చేయించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుమతి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేత

కల్లూరు,ఫిబ్రవరి22: ఈనెల 28నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ హాల్‌టికెట్స్ అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ తిరుపతరావుతో పాటుగా అధ్యాపకులు ఎస్‌కె అతహర్ అలీ, దారా ప్రమీల, చేతుల అందించారు.

గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కోటయ్య



తల్లాడ, ఫిబ్రవరి22: మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పోతురాజు కోటయ్యను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ ప్రత్యేక అధికారి సందర్‌కుమార్ అధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో ఈ ఎంపికను నిర్వహించారు. చైర్మన్‌గా కోటయ్య, సభ్యులుగా ఎక్కిరాల వెంకటేశ్వర్లు, ఐలూరి రామిరెడ్డి, కర్నాటి దుర్గ, ఇనపనూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ఎ వెంకటకోటారెడ్డి, అన్నం వెంకటేశ్వరరెడ్డి, కోటారెడ్డి, దర్గయ్య, లక్ష్మారెడ్డి, జి.వెంకటాచారి, ఐలూరి శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆ భవనానికి విశ్రాంతి

- ఎందరో రాజకీయ ఉద్దండులు సేదతీరిన బిల్డింగ్ సిథిలావస్థకు
- అధికారుల నిర్లక్ష్యంతో రూపుకోల్పోయిన నాయకన్‌గూడెం విశ్రాంతి భవనం

కూసుమంచి, ఫిబ్రవరి22: మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలోగల ఐబివిశ్రాంతి భవనం సిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు బస చేసిన ఈ భవనం నేడు బలసేందుకు అనువుగా లేనికారణంగా విశ్రాంతి తీసుకుంటోంది. ఖమ్మం- సూర్యాపేట ప్రధాన రహదారిపై దశాబ్దాల క్రితం పాలేరు చెరువు నిర్మాణ సమయంలో నాయకన్‌గూడెంలో నీటిపారుదలశాఖ (ఐబీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్మించారు. గతంలో భవనం మరమ్మతులకు 2006లో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.14లక్షలు మంజూరీ చేసింది. దీంతో భవనంలో తాత్కాలిక మరమ్మతులతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు, ఫర్నీచర్ కొనుగోలు, టాయ్‌లెట్స్ ఏర్పాటు తదితర పనులు చేయించారు. తర్వాత మళ్లీ పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరింది.

ఇద్దరు ముఖ్యమంత్రుల బస

నాయకన్‌గూడెం విశ్రాంతి భవనానికి మంచిగుర్తింపు ఉంది. మాజీ ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీ రామారావు పలుసార్లు గడిపిన సందర్భాలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతుంటారు. జిల్లా కేంద్రంలో పెద్దపెద్ద విశ్రాంతి భవనాలు ఉన్నప్పటికీ వారు ఇక్కడే బస చెయ్యటం విశేషం. వీరితోపాటు అనేకమంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు బసచేసిన సందర్భాలున్నాయి.

సమస్యలు తిష్ట

సుమారు పదిహేను సంవత్సరాల క్రితం మరమ్మతులు చేసినప్పటికీ భవనం తిరిగి శిథిలావస్థకు చేరింది. వర్షాలకు గదులు కురుస్తున్నాయి. వాచ్‌మెన్‌కు గది లేదు. ప్రహారీ కూలిపోయింది. స్వీపర్, వాచ్‌మెన్ పోస్టులు ఖళీగా ఉన్నాయి. విశ్రాంతి భవనానికి వెళ్లాలంటే సరైన దారికూడా లేనిపరిస్థితి నెలకొంది. విద్యుత్ దీపాలు సరిగా వెలగవు, మంచినీటి సదుపాయం సరిగా లేదు. ఫలితంగా భవనం రూపు కోల్పోతుంది. కాగా నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ నాగేందర్ ఇటీవల మండలంలో పర్యటించారు. సాగర్ కాల్వలతో పాటు, నాయకన్‌గూడెం గెస్ట్‌హౌజ్‌ను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన పర్యటన ముగిసి ఇప్పటికి నాలుగైదు నెలలు గడిచినప్పటికీ స్పందన లేదు.

మంత్రి పొంగులేటి ఆదేశించినా..?

అదేవిధంగా ఇటీవల నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపధ్యంలో పాలేరు నుంచి గెలుపొందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేబినేట్ పదవి పొందారు. ఈక్రమంలో పాలేరు నియోజకవర్గంలో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి... నాయకన్‌గూడెం గెస్ట్‌హౌజ్ మరమ్మతులపై ప్రశ్నించారు. వెంటనే పనులు వేగిరం చేయాలని ఆదేశించారు అయినా మోక్షం లభించడం లేదు.



నాయకన్‌గూడెంలోని ఐబీ విశ్రాంతి భవనం



శిథిలమైన వంటశాల

నేటినుంచి శ్రీసాయి సుందర రామదాసు మందిర రజతోత్సవాలు

నేలకొండపల్లి,ఫిబ్రవరి22: మండల కేంద్రంలో ఖమ్మం రోడ్డులో ఉన్న శ్రీసాయి సుందర రామదాసు మందిరం రజతోత్సవాలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమాలను దాతల సహకారంతో శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్నారు. రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రీసత్య సేవాసమితి ప్రకటనలో కోరింది.

అంతర్జాతీయ కవలల దినోత్సవం

వైరా, ఫిబ్రవరి22: మండలంలోని గొల్లపూడి అనాథ వృద్ధాశ్రమంలో గురువారం అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. గుడిమెట్ల వెంకటరోహన్, వెంకటరోషన్ జన్మదిన వేడుకలను తల్లిదండ్రులు గుడిమెట్ల రజిత, మోహన్‌రావు వృద్ధుల మధ్య నిర్వహించారు. ఆశ్రమ ఇన్‌చార్జ్ కె.విజయకుమారి, దమయంతమ్మ, మంగమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

పకడ్బందిగా పరీక్షలు నిర్వహించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి22: ఇంటర్ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు.మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రామచంద్రరావుకు మేయర్ నివాళి

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి22: సీపీఎం సీనియర్ నాయకులు మాటూరు రాంచంద్రరావు భౌతిక కాయానికి మేయర్ పునుకొల్లు నీరజ గురువారం నివాళులు అర్పించారు. శ్రీనివాసనగర్ బెస్తకాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయంపై పూలమాలలు వేశారు. మేయర్‌తో పాటు బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్, సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మాటూరి లక్ష్మీనారాయణ, ధనాల శ్రీకాంత్, లెనిన్‌చౌదరి నివాళులు అర్పించారు.

పశువైద్యులపై ఆరోపణలు సరికాదు

జిల్లా పశువైద్యుల సంఘం

ఖమ్మంవ్యవసాయం,ఫిబ్రవరి22:యాదవ, కురమలకు గత ప్రభుత్వం ఇచ్చిన గొర్రెల పంపిణీలో అవకతవకలు జరిగాయని కాగ్ ఇచ్చిన నివేదికలో పశువైద్యులపై వస్తున్న ఆరోపణల ను ఖండిస్తున్నట్టు జిల్లా పశువైద్యుల సంఘం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. గొర్రెల పంపిణీకి సంబందించి కొనుగోలులో పశువైద్యులకు ఎటువంటి సంబందంలేదన్నారు. కేవలం కొనుగోలు ఏరియాలకు వెళ్లి గొర్రెలను పరీక్షించడం వరకే తమ బాధ్యత అన్నారు. కాగ్ ఇచ్చిన నివేదికలో 20 ఇన్‌వాయిస్‌లు ఒకే నంబరుపై ఉందని మాత్రమే ఉందన్నారు. అందులో పశువైద్యులపై ఎటువంటి ఆరోపణలు చేయలేదన్నారు. పశువైద్యులపై వస్తున్న ఆరోపణలను సంఘం ఖండించింది. ప్రకటన విడుదల చేసిన వారిలో పశువైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఉపేందర్, డాక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.